# దోబూచులు

కొడుకు మీద పెద్ద ఆశలు పెంచుకున్న దుర్గమ్మకు కొడుకు సంజీవరావుని గురించి నీలివార్తలు వినబడసాగాయి. తన ఆశలు నిరాశలౌతాయేమోనని, చెప్పాపెట్టకుండా ప్రయాణమూ తనిఖీ చేయవెళ్లింది.

సంజీవరావు వేరే వూళ్లో డిపార్ట్‌మెంటల్ స్టోర్ అనే బిజినెస్ పెట్టి, మీ వస్తువులు యింటికి పంపబడును అనే బల్ల పెట్టాడు. అయిదేళ్లలో ప్రాస్పరై, స్టోర్ పెద్దది చేశాడు. షాప్ లిఫ్టింగ్ జరక్కుండా సెక్యూరిటీ ఆఫీసర్ని పెట్టాడు. వస్తువులు చూపేందుకు మనుషుల్ని పెట్టాడు. పాప్ కారన్ మెషీన్ పనిచేస్తూ కనిపిస్తుంది. దాని దగ్గరో మనిషి వేగిన పేలాలను పొట్లాలు కడుతూ కనిపిస్తాడు.

అద్దె యింట్లో వున్నాడు. దండిగా స్తోత్రపాఠకులూ, కాకా పట్టేవారూ, గూన్సు గూడా వున్నారు సంజీవరావు చుట్టూ.

ఇంటిముందు బండీ దిగుతున్న తల్లిని చూశాడు సంజీవరావు. '' చెప్పకుండా వచ్చేశావే మమ్మీ. ఫోన్ చేస్తే కారు పంపేవాడిని. నీ చెల్లెళ్లు బావున్నారా? తమ్ముడు బావున్నాడా?'' అని తల్లి చేతిలో సంచీ అందుకున్నాడు. లోపలికి నడిచారు.

మర్యాదలు పాటిస్తున్నాడా లేదా అని చూడలేదు తల్లి. ఇల్లంతా తిరుగుతూ, దొంగను పట్టాలనీ, కనీసం గుర్తు పట్టాలనీ వచ్చింది. దొరికితే దొంగ దొరక్కపోతే దొరా అన్నట్టు, కొడుకేమో దొరలాగే కనిపించాడు. దొడ్లో బట్టలారేయటానికి కట్టిన తాడు మీద, చీరముక్క గానీ, రవిక పీలికగానీ కంటబడలేదు. బెడ్‌రూమ్‌లో, అద్దానికీ గోడకీ యెక్కడా బొట్టు బిళ్లలుగానీ, కాటుక మరకలు గానీ కంటబడలేదు గానీ, కాటుక రంగులో వున్న గూన్స్ యిల్లంతా ఫ్రీగా తిరుగుతూ దుర్గమ్మ నెగాదిగా చూశారు.

దొరవంటి సంజీవ కనుసన్నలతో, రెండు గదులు ఖాళీచేయబడి, క్లీన్ చేయబడ్డాయి. గాస్ స్టౌ వంట సరంజామా, సిలిండర్, వంట పాత్రలూ, పాలూ పెరుగూ తెచ్చారు గూన్స్.

కాకా పట్టే బుల్లెమ్మ తెల్ల ధోవతీ గుండు మీద తిప్పి వేసుకుని వచ్చింది. తలారా స్నానం చేసింది. హరిహరీ శివ శివా గోవింద గోవిందా అంటూ తడిబట్టకట్టేవంట చేసింది. దుర్గమ్మ పట్టుచీర ఆరేసింది. ఆరాక కుచ్చీలు పెట్టి తెచ్చి వాల్చిన పీట మీదుంచింది.

దుర్గమ్మ స్నానం కానిచ్చి పొడిబట్ట కట్టి రాగానే, నేల మీద నీళ్ల చిలకరించి, అరిటాకు కొసాకు వేసి, తడి గుడ్డతో తుడిచి, వేడి వేడి పదార్థాలు వడ్డించింది. అన్నం, పప్పూ, కూర, దోసముక్కల పచ్చడీ, పులుసూ, అప్పడం, వడియం, నిమ్మకాయ వూరగాయ కొత్తదీ, పెరుగూ, సేమ్యా పాయసం గారెలూ, వంగుని నెయ్యి వడ్డించింది. పెరుగు చిందకుండా వేసింది. మారు వడ్డించింది. తల్లి లేచి వెళ్లాక విస్తరి మడిచి పారేసి వచ్చి శుద్ధి పెట్టి పీట గోడకానించింది. అద్దం కుంకుమా అల్మరాలో వుంచి వచ్చి, తన భోజనం ముగించింది.

సాయంత్రం అయిదింటికి, ఆశ్రితురాలు డాక్టరమ్మ కామాక్షమ్మా, నర్సు పార్వతీ వచ్చి దుర్గమ్మకి చెకప్ చేశారు. ఆరోగ్యంగా వున్నారని చెప్పింది కామాక్షి.

''యేదో దుర్వార్త విని ఆవేశపడి వచ్చారండీ మీ తల్లిగారూ. కొద్దిగా రక్తపోటున్నది. ఇంకేం లేదు. ఆ రక్తపోటు రావటానికి మీరే కారణమై ఉండాలి'' అని నవ్వుతూ అన్నది. నర్సగూడా నవ్వుతూ సామాను సర్దేసింది. రక్తపోటు తగ్గేందుకు మాత్ర లిచ్చింది కామాక్షి. నర్సును రమ్మని కారులో దూర్చి డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోయింది.

శౌరయ్య అనే స్తోత్రపాఠకుడు కారు తెచ్చేశాడు. కార్లు అద్దెకిచ్చే బిజినెస్ నడుపుతున్నాడు శౌరయ్య.

''యేడున్నరకి రైలు అమ్మగారూ. మీరు యేడుగంటలకే కార్లో వుండాలి. టికెట్ కొనటమైపోయింది'' అని దుర్గమ్మను వేగిర పెట్టాడు శౌరయ్య. కారు మెరిసేటట్టు తుడుస్తున్నాడు.

''మా అబ్బాయి రాడూ స్టేషన్కి?'' మంద్ర స్వరంతో దీర్ఘం తీస్తూ అడిగింది.

''రారమ్మా. కార్పోరేషన్ యెన్నికలు రాబోతున్నాయి. నాలుగిళ్లలో చెప్పి వాగ్దానం తీసుకురావాలని వెళ్లారు. యెన్నికలై పోయేవరకు వుంటారా మీరు? బాబు రావాలా? నే పోనా? టికెట్ రిఫండ్ చేస్తా'' అని జబర్దస్తీ చేశాడు.

''అక్కర్లేదు. వూరికే చూసిపోదామని వచ్చాను. నాకింటి దగ్గర చాలా పనున్నది. అది సరేగానీ. బాబుని గురించి అలాంటి వార్తలెందుకు పుట్టాయి?'' అని లోపాయకారీగా నవ్వింది.

''యెలాటి వార్తలు విన్నారూ?'' అన్నాడు. చక్రాల్లో గాలి ఒక మెషీన్తో చూస్తున్నాడు. అటు చూస్తున్నాడు

''యెవరో మనిషిని చేరదీశాడనీ, ఆ మనిషి అడపా దడపా వస్తూ వుంటుందనీ, రాత్రిళ్లిక్కడే దిగడిపోతుందనీ, దాని కన్ని సౌకర్యాలూ జరుగుతున్నాయనీ'' అంటున్నది.

తలెత్తి ఆవిడ వేపు నిశితంగా చూశాడు శౌరయ్య.

''అవా? బాబు అందరితో చనువుగా ఫ్రెండ్లీగా వుంటారు. అడిగిన పన్లు చేసి పెడుతూ వుంటారు. అందుకని చాలా మంది వస్తూపోతూ దిగడుతూనే

వుంటారు. యెంత మందిని అనుమానం మీద పట్టుకోగలరు? అసలు కార్పోరేషన్ అధ్యక్షునిగానే యెన్నికలకు నిలబెట్టాలని చూస్తున్నారు. మంచి మాటకారి బాబు. అదే జరిగితే యింకా యింకా మనుషులు బాబు చుట్టూ తిరుగుతూ వుంటారు. మీరు ఆపగలరా? పన్లు నెరవేరద్దూ! నేపోతున్నా. నాకు మరో బాడుగ వున్నది. బాబు నన్ను కనిబెట్టి చూస్తుంటే విశ్వాసం వల్ల వచ్చాను. బాడుగ తీసుకోను'' అని నిలబడ్డాడు. పెట్రోల్ చూడాలి.

'' ఉండు వెళ్లకు. అయిపోయింది. వంటామె విస్తట్లో ఫలహారం పెట్టేసింది. నేను రాత్రిళ్లు భోజనం చేయను. ఇల్లు చేరేప్పటికి రాత్రి పొద్దుబోతుంది. నేనిట్లా అన్నానని మా అబ్బాయితో అనకు'' అని లోపలికి పోయింది దుర్గమ్మ.

డ్రైవర్ శౌరయ్య నవ్వుతూ నిలబడ్డాడు.

2

చలాకీగా వుండి ఆరోగ్యంగా వున్న కమలిని మీద సంజీవరావు కన్ను పడింది.

'' ఈ పిల్ల తనకు పన్నెండేళ్లే అనుకుని స్వేచ్ఛ వాడుకుంటున్నది. గెంతుతూ అందరిళ్లకూ వెళ్తున్నది. దీనికి కనీసం యిరవై యేళ్లయినా వుంటాయి. వంటి వంపుసొంపులు చెప్పుతాయి. దాస్తే దాగుతుందా వయసూ? అంత స్వేచ్ఛ? దీని రెక్కలు కత్తిరించాలి. 'పట్టవలెరా మరుని కన్యక. కట్టవలెరా మరుని రాజ్యం.' మహాకవి రచించిన కన్యక అనే గేయ కవిత పాడుకున్నాడు. కమలిని బడికెళ్తుంటే యేదో పనివున్నట్టు పక్కదోవన వెళ్లి యెదురుగా రాచబాట యెక్కి, పనివున్నట్టు స్నేహితుడింట్లో దూరి తలుపువోరగా వుంచి చూశాడు.

నడిచి వెళ్తున్న కమలినికి తననెవరో దొంగలాగా చూస్తున్నట్టు

అనుమానం కలిగి లేడిపిల్లలాగా తలా కళ్లూ తిప్పుతూ చూసింది. సంజీవరావు తల కంటబడి మాయమైంది. మూతివిరిచి గబాగబా నడుస్తుంటే లావుపాటి జడ వీపుమీద నాట్యమాడింది. జడచివర సాదా రంగు రిబ్బన్ కట్టింది. ఇంకా కొనలు వంకులు తిరిగి నల్లగా మెరిసినై. దోబూచులాడుతున్న సంజీవరావు ఆ రిబ్బనూ ఆ కొనల గుత్తీ చూశాడు.

మరునాడే బాట మార్చేసింది కమలిని. మరొక బైలేన్ నించి వెళ్లి దీపస్తంభం చాటున నిలబడి, దాగుడుమూతలాడాడు సంజీవరావు. ఈమాటు కమలిని వెంట కోమలవల్లి సహాధ్యాయి వున్నది. కోమలవల్లి సంజీవరావు దోబూచులు గమనించింది. కమలినిని మోచేత్తో నెట్టింది. కళ్లతో సైగచేసి అన్నది.

''సంజీవరావు నీతో దోబూచులాడుతున్నాడోయీ. వాడు దోబూచి. వాడు తల్లినే ఆడించగలడు. వాడిని నమ్మకు'' అని నవ్వింది.

కమలిని తలెత్తి కళ్లు తిప్పి అన్నివేపులా చూసింది. ఈ మాటు సంజీవరావు వొత్తైన క్రాపు కనబడి మాయమైంది. కమలినికి కోపమొచ్చింది. ''యేం చేస్తూ వుంటాడేమిటి దోబూచి?'' అనడిగింది. ''పోదాం రా'' అని గబగబా నడవసాగింది.

''ట్రిక్స్ చేస్తూ వుంటాడు. 'దోబూచీ!' అని ఆడుతూ వుంటాడు'' అని నవ్వుతూ కమలినిని అనుసరించింది కోమలవల్లి.

''నీ వంక చూస్తుంటే నా మీదికి నెడుతున్నావేమో!''

''లేదు లేదు. నాతో దోబూచులాడలేడు. నేను పోలీస్ ఆఫీసర్ కూతుర్ని. మేము హై క్లాస్ కాదు'' అన్నది వల్లి.

''దోబూచి హై క్లాసా'' అని చిరాకుపడింది కమలిని.

''అవునేమో నేను కనుక్కోలేను గాని. స్వభావంలో గాదని చెప్పగలను.'' అని నవ్వింది వల్లి.

అలా రెండు వారాలు గడిచినై. కమలినికి అనుమానం యెక్కువైంది. కోమలవల్లి తోడుందిగదా అని సరిపెట్టుకున్నది. ఆనాడు యిద్దరూ బడినించి వస్తుండగా కుక్కలు కాట్లాడుకుంటూ అడ్డువచ్చినై. అవి వూరకుక్కలు. దుక్కల్లా వున్నాయి. కరుస్తాయేమోనని యిద్దరూ మెట్టు యెక్కి వాకిలి కానుకుని నిలబడ్డారు. మరికొద్దిసేపటికే రెండు గేదెలు వేగంగా రావటం చూసి భయపడి దిగి వెళ్లలేకపోయారు. రోడ్డు సన్నం. అయిదున్నరే అయింది. ఇంకా బాగా వెల్తురున్నది. దిగబోతుంటే మేకల మందా శిడిపోతులూ దోవకడ్డంగా వచ్చాయి.

గోడమీదినించి పాకి వాలివున్న పూదీగ రాధామాధవం మాలతీ తీగా కంటబడి శిడిపోతులు అరుగెక్కాయి. దూరాన గొల్లవాడు గొంగళీ బుజాన సద్దుకుంటూ యింకా చిన్నమేకలను అదిలిస్తూ వస్తున్నాడు. వెల్తాయి అని చూస్తున్నారిద్దరూ.

తలుపులు తెరుచుకున్నాయి. సంజీవరావు తలబైటికి పెట్టి వీళ్లిద్దర్నీ చూశాడు.

''లోపలికి రండిద్దరూ. ఇంకా చాలా మంద వున్నదే'' అన్నాడు.

''మొదటేమో కుక్కలు కాట్లాడుకుంటూ మీద కొచ్చాయండి. తర్వాత గేదెలు నాలుగు. ఇప్పుడేమో యీ మంద. యెలా దోవ ఖాళీగావాలి? అందుకని నిలబడ్డాం'' అన్నది కమలిని.

'' ఇది మీ యిల్లా?'' అనడిగింది కోమలవల్లి.

''కాదు. అద్దె యిల్లే. స్టోర్సుకి దగ్గర్లో మంచి యిల్లు దొరికితే మారాను.

కొత్త యిల్లు చూద్దురుగాని రండిద్దరూ. మేకలు వెళ్లగానే వెళ్లిపోవచ్చు'' అని మళ్లా ఆహ్వానించాడు.

మొహాలు చూసుకున్నారు. ఇద్దరమున్నాం గదా అని అనుకుని యిద్దరూ లోపలికెళ్లారు.

డ్రాయింగ్ రూమ్. మోడరన్ ఫర్నిచర్. ఆకర్షవంతంగా నేలమీద తివాసీ. గోడవారగా టేబిల్. దానిమీద టి.వి. యేదో ఫిల్మ్ అడ్వర్‌టయిజ్‌మెంట్. ఫాన్ తిరుగుతున్నది. మూలగా యెయిర్ కూలర్ చల్లనిగాలి సరఫరా చేస్తున్నది. సోఫాలో సంచీలు కింద వుంచి కూచున్నారిద్దరూ. అతనూ కూచున్నాడు.

''అట్లా వున్నారేం యిద్దరూ?'' అన్నాడు దయగా.

''యెట్లావున్నామండీ?'' అన్నది వల్లి. కూలర్ పంపేగాలికి సేదదీరుతున్నారిద్దరూ. కమలిని వంకే చూస్తున్నాడని గమనించింది. యెదురుగా బల్లమీద అద్దం. దాని మీద లుక్ అనే యింగ్లీష్ పత్రిక కంటబడింది. తీసి చూడసాగింది.

''బాగా టైరైనట్టున్నారు. ఆకలి మొహాలూ, నీట్‌గా లేరు.'' అన్నాడు మార్దవంగా.

''సినిమా పరిభాషలో ఆకలి అంటే అర్థమేమిటో మీకు తెలుసా'' అన్నది కమలిని.

''తెలియదు.'' అన్నాడు.

''మాకు రెండురోజుల్నుంచీ నీళ్లు బంద్. స్నానం లేదు. తడిగుడ్డతో వళ్లు తుడుచుకుని, ఆరబెట్టి, మంచిగుడ్డలేసుకుని బడికి దౌడుతీస్తున్నామండి. వంటాలేదు. గిన్నెలు, పళ్లేలు, గ్లాసులు క్లీన్ చేయాలి. బన్ తిని డ్రింక్ తాగి,

వెళ్తున్నామండి. స్కూల్ ఆనివర్శరీ వస్తున్నది. ఆటలలో పోటీలుంటాయి. సాధన చేస్తున్నాము. యెండాకాలం వచ్చేసున్నది గదండీ. వేడిగా వుంటున్నది. అందుకనలా కనిపిస్తున్నామండి'' అన్నది కమలిని దాపరికం లేకుండా.

'' ఓహో!సారీ! మీరిద్దరూ బాత్‌లో షవర్ తీసుకోండి. తలకు పెట్టుకునే కవర్లు ప్లాస్టిక్‌వి వుంటాయక్కడే. అక్కడే హేంగర్స్‌కి టవల్సు ఉంటాయి. సోపుంటుంది. మళ్లా మీ దుస్తులే వేసుకుని రావచ్చు. లేచిరండి. స్నానం చేస్తే బడలిక తీరుతుంది'' అని లేచాడు.

మళ్లా మొహాలు చూసుకున్నారు. ఇద్దరమున్నాంగా ఫరవాలేదు అనుకుని లేచారిద్దరూ.

లైటువేసి అన్నీ చూసి వచ్చేశాడు సంజీవరావు. కింద పాలరాళ్లు. గోడకున్న షెల్ఫ్‌లో దువ్వెనా హెరాయిల్, గోడకు అద్దం, చాలా సంతోషించి, తలుపుగడియ పెట్టి పనికానిచ్చుకున్నారిద్దరూ. మళ్లా డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చేప్పటికి యెదురుగా నెస్‌కాఫీ, మైసూరు బోండాలు, ఐస్‌వాటర్ ఆహ్వానించాయి.

3

టికెట్ లేకుండా ప్రయాణం చేసే దొంగ ప్రయాణీకుల్ని పట్టాలని, రైలు నడుస్తుండగా, పెట్టెలో తిరుగుతూ, టికెట్ చూపమని చెక్ చేస్తూ, అధికారం చూపే, యూనిఫామ్‌లో కనిపించే తనిఖీ ఇన్‌స్పెక్టరులాగా తల్లి దుర్గమ్మ మళ్లా అటాత్తుగా తనిఖీకి వచ్చి యిల్లంతా తిరిగింది. టికెట్ లేకుండా ప్రయాణం చేసే ప్రయాణీకుని, స్టేషన్ రాగానే దింపివేసే అధికారము తనిఖీ ఇన్‌స్పెక్టర్ కుంటుంది. డబ్బు చెల్లించాలి. లేదా దింపేస్తాడు. అలాగా పెళ్ళి తంతు చేసుకోకుండా కొడుకుతో జీవితమనే ప్రయాణం చేసేదాన్ని. అక్కడికక్కడే గెంటేయాలని, హుందాగా పట్టుచీరా, రవిక, నగలూ ధరించి వచ్చింది. కాని టికెట్ లేని

ప్రయాణీకురాలు పట్టుబడలేదు. బాత్‌రూమ్‌లో దాక్కుందేమోనని, బయట కుర్చీలో బైఠాయించింది. లోపల చప్పుడూ లేదు. మనిషి బైటికీ రాలేదు.

''యెక్కడ దాచాడో!'' నని ఆలోచించింది. విసుగేసి లేచిపోయింది. తాను వచ్చిన రైలు ఛార్జీలు దండగ. దొంగ ప్రయాణీకురాల్ని పట్టలేక పోయినానని వుక్రోషపడింది. ఆ అక్కసు సంజీవరావు మీద కక్కింది.

తల్లి ఆడే ఆట, దానిక్కారణం కొడుక్కి తెలుసు. తాలిమి చూపాడు. ఘర్షణపడితే నష్టం. హ్యూమరస్ వేలో వోడించి మర్యాదగానే పంపేయాలి. సమయానికి దేవతలాగా లేడీ ఫ్రండ్ వచ్చింది. చాలా చక్కనిది. కలవారి బిడ్డ. చదువుతున్నది. మొగుడందే వరకూ ఆ చదువంతే అని నవ్వుతుంది. కారు తోలుకుంటూ వస్తుంది. రోమన్ కాథలిక్. బొట్టు పెట్టుకుంటుంది. హిందూయే అనుకుంటారు తెలియనివారు. పేరు ఆరోగ్యం.

దుర్గమ్మ డ్రాయింగ్ రూమ్‌లో, హుందాగా, సోఫాకి నిండుగా కూచుని వుండగా వచ్చింది ఆరోగ్యం.

''నమస్తే'' అని దణ్ణం పెట్టి యెదురుగా సోఫాలో కూచున్నది, బుద్ధిమంతురాలిలాగా. చెప్పులు వదిలే వచ్చింది లోనికి.

''మీరు సంజూ తల్లిగారనుకుంటా. బాగా పోలికలు దగ్గరే. మీ అందమే మీ బంగారం రంగే సంజూకి వచ్చింది. నిండైన విగ్రహం. సంజూమనసుగూడా బంగారమే. బంగారుకి తావి అబ్బినట్టు దయగలవాడు సంజూ. యాత్రలు చేస్తూ వచ్చారా? వూరు చూడాలని వచ్చారా? సంజూ బిజినెస్ బాగున్నది. కొత్త ఐటమ్స్ పెడుతున్నాడు. లెక్కలు స్వయంగా చూసూకుంటాడు సంజూ'' అని ఖత్తు కలిపింది.

తైరు పోస్తున్నదని అర్థమైనా, ఇదేనేమో టికెట్‌లేని ప్రయాణీకురాలని శల్యపరీక్ష చేసింది దుర్గమ్మ. తనకూ నాగరకతున్నదని చూపాలని, వివరాలడిగింది.

''అప్ప చెల్లెళ్లెంతమంది మీరు?''

''ముచ్చటగా ముగ్గురం'' అని మూడువేళ్లు చూపితే వుంగరం వేలికి రవ్వ వుంగరం, చేతికి రిస్టు వాచీ మెరిశాయి.

''అన్నదమ్ములు?''

''ప్రస్తుతం లేరు. తమ్ముడుపుట్టే అవకాశమున్నది. మా అమ్మకు ముప్పై ఆరేళ్లే. నేను పద్దెనిమిదో యేట పుట్టాను. మా నాన్నగారి వయస్సూ తక్కువే. నలభై. ఎలక్ట్రానిక్ పరికరాలూ, స్టీలు సామానూ వ్యాపారం చేస్తున్నారు. షూమార్ట్ వున్నది. ఒకటీ అరా కారు అమ్మి డబ్బు చేస్తారు. కొత్త కారుకొని కొన్నాళ్లు వాడుకుని కొంచెం తక్కువ ధరకి అమ్మేస్తారు. అదొక లాభం. సంజూకి పెళ్లి సంబంధం కుదిరిందా? తీసికెళ్టానికి వచ్చారా అత్తయ్య గారూ? నేను పెళ్లి కూతుర్ని కాదు మేడమ్. సంజూయే నాకు మంచి సంబంధం చూసి పెడతానన్నాడు. గాలి ప్రయాణానికి టికెట్ కొనడు సంజూ. చాలా బిజీగా వున్నాడే. నాకు యన్నారై కావాలన్నాను. చూస్తున్నానన్నాడు'' అంటుండగా సంజీవరావు కొట్టు మూయించి వచ్చాడు. రెండైంది మధ్యాహ్నం. వెంట వందిమాగధులూ. ఆరోగ్యం లేచి యెదురెళ్లింది. మొహం చింకి చాటంత చేసి అన్నది.

''మీ మదర్ని నేను గుర్తించా సంజూ! నేను సైట్ సీయింగ్‌కి తీసికెళ్తా మీ మదర్ని. యెంతవరకు వచ్చింది నా మాచ్ సంగతీ! గ్రూమ్ ఫోన్ చేశాడా? వస్తాడటనా పెళ్లిచూపులకి?'' అంటూ పక్కగా నడిచింది.

దుర్గమ్మ చూసింది. '' ఈడూ జోడూ'' అనుకున్నది. ''పిల్లవాడి బుజాల దగ్గరకి వస్తున్నది. కలుపుగోలుతనమున్నది. భాగ్యమున్నా బెట్టు లేదు.'' అని సంతోషించింది. వాళ్లిద్దరూ యెటుబోతే అటు చూసింది.

కూడా వచ్చిన వందిమాగధులూ బాగా నాగరకులు.

''బాబుకి సంబంధం చూశారా మామ్మగారూ? ఒట్టి అమాయకుడు. ఆడోళ్లని కన్నెత్తి సూడడు. అల్లే బెమలు పెంచుకుని మీద బడతారు. మేము సెప్పాము. బాబును పెల్లాడాలంటే మామ్మగార్ని మెప్పించాల. ఒంటినిండా నగలు దిగేసుకుని రావాల. మడీ దడీ తెలియాల. ఇనయంగా మసలుకోవాల. అవటా అని. చానా మంది అమ్మాయిలు బాబు ఒంటరివాడు, చాలా స్వేచ్ఛ వున్నదనుకుంటున్నారు. అదే భ్రమ. తల్లి మెచ్చనిదీ తాకను గూడా తాకడు నిన్ను. యెఱ్ఱి మొకమా అని నవ్వినాము'' అని ఒక భక్తుడు యికిలించాడు.

మరొక ఆశ్రితుడు, ''ముందు మామ్మగార్ని మెప్పించాల తర్వాత బాబును ప్రేమించాల. 'వూ ది మామ్మా అండ్ లౌ ది బాబు' అని సెప్పినాము.'' అని నవ్వాడు.

దుర్గమ్మ '' ఆ అమ్మాయి బావున్నది మల్లెపువ్వులాగా బంగారబ్బొమ్మలాగా. మంచి ఆపేక్షగల పిల్ల'' అంటుండగా సంజీవా, ఆరోగ్యం దగ్గరకొచ్చారు.

''నీకు నచ్చినా ఆరోగ్యం నన్ను చేసుకోదు. ఆమె దృష్టి అంతా, అమెరికాలో రెండు చేతులా సంపాయించే వాడి మీదున్నది. ఈమెకు వుద్యోగం గూడా చూసిపెట్టాలిట. ఛారిటీ ట్రస్ట్ అని యేర్పాటు చేసి, వికలాంగుల సేవ చేస్తుందిట'' అని నవ్వుతూ చెప్తుంటే సంజీవరావుని చూస్తూ ఆరోగ్యమూ నవ్వింది. మళ్లా అన్నాడు.

''నువ్వు తయారుకా. ఈ చుట్టుపట్ల చూడదగినవన్నీ తానే చూపుతుందిట. వాళ్లమ్మా, అక్కా నీకు తోడువస్తారుట. నీక్కావల్సిన సౌకర్యాలు చూస్తుందిట'' అన్నాడు.

వంది మాగధులు సంజీవ భోజనం కానివ్వగానే తోలుకెళ్లారు.

''మా యింటి కెళదాం రండి అత్తయ్యా. మా అమ్మ సంతోషిస్తుంది. భోజనమైందా? నేనిక్కడే కూచుని వుంటా, మీరు పోయి పట్టుచీర కట్టుకురండి.'' అని కూచున్నది ఆరోగ్యం.

4

కమలిని వంటరిదై పోయింది. ఇంటర్ చదువుతున్నా సంతోషంగా లేదు. కోమలవల్లి తండ్రిని సి. ఐ.డి. శాఖలోకి పంపి బదిలీ చేశారు. కోమల టిసి తీసుకుని సర్టిఫికేట్ తీసుకుని గుడ్ బై చెప్పింది.

మళ్లా కోమలవల్లి అంత ఆత్మీయురాలంటి ఫ్రెండ్ అందలేదు. 'గుహ్యందదాతి పృచ్ఛతి. దదాతి ప్రతి గృహ్ణాతి' అని అరమరికలు లేవు వల్లికి. వీళ్లు యెవరిగొడవలో వాళ్లుంటారు.'' అని వ్యథపడింది. ''జిడ్డులాగా పట్టుకున్నాడోయీ దోబూచి.'' అని చిరాకుపడింది. ''బీట్ వేసి పడుతున్నాడు. ఈ జిడ్డు వదలటం లేదే. యెలా? దేనితో తోమి వదిలించుకోవాలీ?'' అని బస్‌స్టాప్‌లో నిలబడి బస్‌కోసం నిరీక్షించింది. ''మిత్రము తగుమందు'' అన్నారు. ఫ్రెండ్ కాస్తా నన్ను వదిలి వెళ్లింది. ఈ బూచిని టాకిల్ చేయటం ప్రాబ్లమ్‌లాగా తయారైంది. ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసి లెక్కలు టీచర్ ప్రశంస పొందాను. యేమిటి లాభం. నిజజీవితంలో సాల్వ్ చేయలేకపోతున్నాను. డోంట్‌బి రూడ్ అన్నది మదర్ సుపీరియర్. రూడ్‌గా జవాబివ్వలేదు. రీజన్ చేసి చూడాలి వదులుతాడేమో. మంచిగానే వుండాలి.'' అని మథనపడింది కమలిని.

5

కమలిని తల్లి భాగీశ్వరి. భాగీశ్వరి పూర్వీకులు పరగణాలేలారు. అరిస్టోక్రాట్. ప్రస్తుతం అణగదొక్కబడిన తరగతిలో నడుస్తున్నది జీవితం. మళ్లా పరగణాలేలాలని ఆశిస్తున్నది. కూతురు కమలిని మునపటల్లే లేదని గమనించింది. మునుపు తిట్టినా, కసిరినా, యీసడించి కొట్టినా, గుడ్లురిమినా, పెద్దగా అరిచినా యేడ్చేది. ఇపుడు నవ్వుతూ నిలబడుతుంది. యెదురూ చెప్పదు. సంబంధం చూశాను, చూడటానికి వస్తున్నారు'' అంటే, ''సరే. ఇవాళే నా చూపులు? పెందరాళే వస్తా.'' అంటుంది. కాని /ఆలస్యంగానే వస్తున్నది. యెవరినన్నా కలుసుకుంటున్నదేమోనని, దొంగను పట్టాలని దోబూచులాడటం సాగించింది భాగీశ్వరి. రామాలయంలో స్తంభం చాటున నక్కింది. శివాలయ మంటపంలో కూచుని బీచీవంకే చూస్తూ లేచి చూసింది. కంటబడలేదు. భాగీశ్వరికి హైపర్‌టెన్షన్ వున్నది. '' ఈ కమలిని చదివి వుద్యోగం వెలిగిస్తానని అన్నది. చదువు చట్టుబండలు చేసి శోభనం చేసుకున్నదేమో!'' అని అనుమానించింది. కూతురు మొహం వెలిగిపోతున్నది. యెండు కట్టెలాగా వుండే కమలిని వళ్లు చేస్తున్నది. ఇది బియ్యేదాకా వెళ్లగలుగుతుందా? అనుకున్నది. ఆనాడు కమలిని యింటికి రానే లేదు. దీపాలు వెలిగినై యేడున్నర, యెనిమిది, యెనిమిదన్నర అయింది. ఇంక వుండబట్టలేక కాలేజీకెళ్లి వాచ్‌మన్ని అడగాలని బయలుదేరింది. దోవలోనే సంజీవరావు యిల్లు. తలుపుతీసే వున్నది. వీడింట్లో దూరిందేమో. యెంత ధైర్యం తలుపన్నా వేసుకోలేదు అనుకుంటూ తానే మెల్లిగా లోపలి కెళ్లింది.

లైట్లు వెలుగుతున్నాయి. డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూచుని వున్నాడు సంజీవరావు. ఆనాడు శనివారం. కొట్టునించి యెనిమిదింటికి వచ్చేశాడు. మోచేయి సోఫా చేతికాని వున్నది. అరచేయి ముడిచి చెంపకాన్చి వున్నది. తల కొద్దిగా పక్కకి వున్నది. ముదురు రంగు ఫాంటూ తెల్లని షర్టూ,

కళ్లజోడూ. ఒక కాలుమీద ఒక కాలువేసి వుంచాడు. రెండో చేతిలో యేదో పత్రిక వున్నది. యెదురుగా సోఫాలలో యిద్దరు కస్టమర్స్. పనివుండివచ్చి చెప్పుకుంటున్నారు. వింటున్నాడు. భాగీశ్వరి లోపలికి రావటం చూశాడు.

"ఆ సోఫాలో కూచోండి." మూలగావున్న సోఫా చూపాడు. వెయిట్ చేయాలని కూచున్నది.

ఓ అరగంటకు వ్యవహారం ముగిసి కుర్చీలలోని వారు వెళ్లిపోయారు. యేమిటన్నట్లు భాగీశ్వరి వంక చూశాడు.

"తెలియనట్టు చూస్తున్నాడు నటకుడు" అనుకున్నది భాగీశ్వరి.

"కమలిని యింటికి రాలేదు. ఇక్కడికొస్తున్నదని తెలిసింది. ఇంతసేపా కబుర్లు! యేమి చేస్తూ వుంటుందింతసేపు? పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ వుంటుందా? ఇంట్లో వుండటం తక్కువే. మా అమ్మాయినే యెందుకు పట్టావు? ఇంకెవరూ అందలేదా? దానినేమి చేయదలచావూ? అది నిష్కారం మేలు".

"అనుమానమెందుక్కలిగిందీ? ఇక్కడే పట్టుబడుతుందని యెలా వూహించారు?" అన్నాడు తొణక్కుండా.

భాగేశ్వరి డ్రమెటిగ్గా తన కొంగు విప్పి, స్నాప్స్ ప్యాకెట్ తీసి, అందలి ఫొటోలు తీసి అందించింది.

సంజీవరావు వాటిని చూశాడు.

"అవి, మీ పింతల్లి కొడుకు, మీ తమ్ముడు కృష్ణ తీశాడు. మా వీధిలోనే ఆరో నంబరింట్లో అద్దెకున్నారు వాళ్లు. మీ వల్లనే దాని వెంటబడి, యీ గొందిలో, ఆ సందులో పొంచి వుండి తొంగి చూస్తూ యెలాగైతేనేం దాన్ని పట్టాడు. కమలిని తిరస్కరించి వెక్కిరించిందట. "నిన్నా? క్లర్కుని?" అని నవ్విందట. అవి తీయగలిగాడు. పగబట్టాడేమో నాకిచ్చాడు. చెప్పాడు.

''నేను పెళ్లాడుదాము రా. అనడిగితే యీసడించి కొట్టింది. యేమి నేను తగనా కమలినికి? అంత గొప్పింటి బిడ్డా? భాగమ్మా? యెంతమందితో తిరుగుతున్నదో చూపగలను యింకా ఫొటోలున్నాయి నాదగ్గర. మా అన్నయింట్లోంచి రావటం, వాడితో తిరగటం చూశాను. డబ్బున్నవాడిని పట్టింది గానీ, వాడు చేసుకోడు. వాడికి చాలామంది లేడీ ఫ్రెండ్స్ వున్నారు. వాళ్లే డబ్బు అందిస్తారు. వాళ్లమ్మ పర్మిషన్‌లేనిదీ యేమిచేయడు. ఇవన్నీ కమలినికీ చెప్పాను భాగమ్మా. దాని చెవిలో దూరలేదు నా హితము. చేతులు కాల్చుకుంటుందేమో కమలిని నేను మంచివాడిని గనక ముందే చెప్పాను. మా అన్నది కడుపునిండిన బేరమని గూడా చెప్పాను'' అని ముక్కు నలుపుకున్నది భాగమ్మ. సంజీవరావు వింటూ కూచున్నాడు.

మళ్లా పనస చదివింది. ''ఛీట్ చేయటమెందుకు? డబ్బు పారేస్తాడు గాని గౌరవమివ్వడని గూడా క్లియర్ చేశాడు కృష్ణ.''

''నేనూ కమలినికి వార్నింగిచ్చాను. నాకు దురుద్దేశం లేదు. మీరే మీ అమ్మాయికి మితిమీరిన స్వేచ్ఛ నిచ్చారు. మీ వుద్దేశమేమిటి? అందరిళ్లకీ యెందుకు పోనిస్తారు? ఇవాళిక్కడికి రాలేదు. వాళ్ల కాలేజీలో ఫంక్షనున్నదిట. జానపదగేయాలు పాడుతుందట. నాకు కాలేజివారు ఆహ్వానం పంపారు. నాకు వీలుగాక వెళ్లలేదు. మీరొచ్చే ముందే నేనూ యింటికి వచ్చాను. కమలిని తన ప్రోగ్రామ్ సంగతి యింట్లో చెప్పలేదా? అంటే అన్నీ దాస్తున్నదన్నమాట. యేదైనా పథకం వేసుకున్నదేమో. మీరు నా కారులో వెళ్లి కమలినిని తెచ్చుకోండి. మిమ్మల్నిద్దర్నీ యింటి దగ్గర దింపి వస్తాడు డ్రైవరు'' అని డ్రైవర్ని పిలిచి కారు బైటికి తెమ్మని పనిచెప్పాడు సంజీవరావు.

భాగీశ్వరి లేచింది. ఫొటోలు కవర్లో సర్ది కొంగుకి కట్టుకున్నది. వీధిలో కొచ్చింది.

''అబద్ధాలాడుతున్నాడు. టక్కరి. యెవరిననుకుంటున్నాడు నన్ను? డబ్బులేని వాళ్లని పట్టుకుంటాడా కమలినిని? మరీ మంచిది. వీడి పిలక నా చేతులో చిక్కుతుంది. నిలువుదోపిడీ చేసిన వారున్నారు నా వేపు యేమనుకుంటున్నాడో!'' అని మనస్సులోనే ఛాలెంజ్ చేసింది.

డ్రైవరు కారు తలుపు తీసి పట్టుకున్నాడు.

''నన్ను మా యింటి దగ్గర దింపేయ్. మా యిల్లు తెలిసే వుండాలి నీకు. మా అమ్మాయిని వూరేగిస్తూవుంటావు'' అని పళ్లు పటపటలాడించి తల విసిరింది.

డ్రైవర్ నవ్వాపుకుంటూ, ''యస్ మేడమ్'' అని భాగేశ్వరి యెక్కగానే తలుపు మూసి వచ్చి చక్రం బట్టాడు.

## 6

దుర్గమ్మకు తనిఖీకి వెళ్లేందుకు వెసులుబాటు చిక్కలేదు. చెల్లెలి కొడుకు రైల్వే వుద్యోగం చేస్తున్నవాడు ప్రమాదంలో పోయాడు. తమ్ముని కొడుకు నక్సల్ అని పట్టుబడి కటకటాల వెనక్కి తోయబడ్డాడు. వాని కుటుంబం నిరాధారమైంది. మొగుడు జగ్గరాజు గార్నీ కొడుకు సంజీవరావునీ వెంటబెట్టుకెళ్లి వాళ్ల ఆర్తి తీర్చి కుటుంబాన్ని ఒడ్డు పట్టించి వచ్చేప్పటికి, తల్లి మృత్యుశయ్య మీదున్నదని టెలిగ్రామ్ అందింది. దుర్గమ్మ తల్లికి చాలా నగలున్నాయి. అవి ఆమె కన్నతల్లి పెట్టినవేట. అవి తన కూతురుకివ్వాలని టెలిగ్రామిప్పించింది. మళ్లా మొగుడూ కొడుకూ వెంట వెళ్లారు. దుర్గమ్మ తండ్రి నూరవపడిలో వుంటే తల్లి తొమ్మిదవ పడిలో వున్నది. సంజీవరావు నాల్రోజులుండి, తన వ్యాపారం చూసుకోవాలని వెళ్లిపోయాడు. మరోవారముండి భర్త జగ్గరాజూ వెళ్లిపోయాడు. దుర్గమ్మ వుండిపోయింది.

నగలు తీసుకునే వెళ్లాలి మరి.

మళ్లా తనిఖీకి వెళ్లాలని లగ్న నిశ్చయం చేసేనాటికి నాలుగేళ్లు గిర్రున తిరిగిపోయాయి.

అప్పుడు రుద్రయాగం చూతాం రమ్మని దుర్గమ్మ మొగుడు జగ్గరాజుని ప్రయాణానికి సిద్ధం చేసింది.

7

కమలిని బియె డిగ్రీ కొట్టింది. యల్లెసీలో దూరుదామని ప్రయత్నిస్తుండగా కంప్యూటర్ కోర్సుకు అటెండ్ కమ్మని సంజీవరావు డబ్బు కట్టేశాడు. కమలినికి మొనేటరీ హెల్పు అందించాడు.

కాన్వెంట్‌లో హాస్పటల్ విభాగంలో కమలినిని యిరికించింది మదర్ సుపీరియర్.

అక్కడ చూసింది కోమలవల్లి కమలినిని. కోమలవల్లి వదిన హెల్తాఫీసర్‌గా ఆ వూరు బదిలీ అయిందట. కాన్వెంట్‌లో సిస్టర్స్ తెలుసట. చెకప్ చేయించుకుందామని వస్తూ కోమలవల్లినీ వెంట రమ్మన్నది. ఔట్ పేషంట్ విభాగంలో చీట్లు రాసే చోట కనిపించింది. ముందు పేరు తర్వాత కంప్లెయింటూ వ్రాస్తుంది కమలిని. క్యూలో నిలబడ్డారు పేషంట్సు.

''జిగురు వదిలిందా కమలినీ?'' అని నవ్వుతూ అడిగి యెదురుగా కుర్చీ ఖాళీగా వుంటే చూసి కూచున్నది కోమల.

''వదలలేదు కోమలా. దేంతో కడిగితే వదులుతుందో తెలియలేదు. ఆ జిగురుకి తోడు పెయింట్‌లాగా మరొకటి అంటుకున్నది. అదీ తుడిచేసుకోలేను'' అని నవ్వింది.

''మీ అమ్మ దగ్గరుండటం లేదూ? ఈ కన్యలాసుపత్రిలో ఔట్ పేషంట్సుకి చీట్లు వ్రాస్తున్నావేం?''

''కన్యను కనక కన్యలాసుపత్రికొచ్చా. ఔట్ అయినా గనక యిక్కడ కూచోపెట్టింది మదర్ సుపీరియర్.''

''పోనీ మీ అమ్మ నడగలేదూ దేంతో కడిగితే జిగురు వదులుతుందీ అని'' కుతూహలం కలిగి అడిగింది కోమల.

''వెర్రి వెయ్యి విధాలు కోమలా, అడిగితే 'ఆ జిగురట్లాగే వుండనీ. నీకందేది నాకివ్వాలి. ఇవ్వకపోతే నేనే లాగగలను నేను మెత్తని దాన్నిగాను మొత్తటానికి' అన్నది. నమ్ము నమ్మకపో కోమలా అడకత్తెరలో వక్కలాగా అయినా'' అన్నది.

కోమలవల్లి కాసేపుండి వెళ్లిపోయింది. వదిన పిలిచింది.

నాలుగురోజుల తర్వాత అక్కడికే ఆరోగ్యమూ వచ్చింది. వాళ్లక్క డెలివరీకి వస్తున్నదిట. బెడ్ రిజర్వ్ చేయించాలిట. పేరూ అడ్రసూ తేదీ చెప్పింది ఆరోగ్యం. కూచున్నది.

''సంజూ నిన్ను తీసికెళ్లి దగ్గరపెట్టుకోవాలనే ఆలోచనలో వున్నాడు కమల్. అప్పుడు నీకు క్రైసిస్ వచ్చింది గనక, అదనుచూసి పట్టగలిగాడు. మదర్ సుపీరియర్ నీ పక్షమే మాట్లాడుతుంది. ఇప్పుడేమి చేయదలచుకున్నాడు?'' అనడిగింది.

''ముందే తెలిపావు ఆరోగ్యం! థాంక్స్. మదర్ నా పక్షమే అనుకో. కాని మరో క్రైసిస్ రావచ్చు. మతం మారాల్సి రావచ్చు. నేను మతం మార్చుకోనని మదర్‌కి తెలుసు. యే మతమైనా, తనకు లోబడి వుండకపోతే బహిష్కరిస్తుంది

అని చెప్పాను. సాయంగా వున్న మతగురువులే ఆర్యసమాజ్ స్థాపకుడికి, వాడు లోబడివుండటంలేదని విషం పెట్టించారు. సంజూ అంటూ ఒకడున్నాడని మదర్ గౌరవిస్తున్నది. అతన్నెదిరించి నిరాధారమైనానని తెలియగానే మతం మార్చుకోమంటుంది.''

''మరేం చేయదలచావూ కమల్? నేను విదేశం వెళ్తున్నాను మాచ్ కుదిరింది. సంజూకి జిగురని నిక్‌నేమ్ పెడితివి. జిడ్డు వదిలే పద్ధతి చూసుకోవూ?'' అనిగికురించింది.

''అన్నీ మనమనుకున్నట్లు జరుగుతాయా? విధిచేతి కీలు బొమ్మలం. నేను సింగిల్ లైఫ్ లీడ్ చేయాలని ప్లాన్ వేసుకుంటే బాచులర్ మదర్నైనా. నా యిష్టంమీదే అయినానా? పోనీ ప్రయత్నించానా? తప్పించుకోవాలని చూడలేదా?''

''నీ ఫిలాసఫీ నా కర్థం లేదు. నీ డ్యూటీకడ్డు పడుతున్నానేమో. పోతాను. చాన్సుంటే స్టేట్స్‌కి రా.''

8

చెకింగ్ ఆఫీసరుకి, టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ప్రయాణీకురాల్ని రైలు పెట్టెలోంచి దింపేయటం అసాధ్యమయింది. ఆ ప్రయాణీకురాలికి లగేజ్ చాలా వున్నది. తక్కిన ప్రయాణీకులు తనిఖీ ఆఫీసర్ని మిర్రి మిర్రి చూస్తున్నారు. ఇద్దరు పిల్లలు ఇల్లంతా తిరుగుతున్నారు. మళ్లా నెలలు ట్రావెలర్‌కి. విలువైన ఫర్నిచర్, గోద్రెజ్ బీరువా, నౌకర్, చాకర్, కారు, డ్రైవర్, కుక్, కుక్కలు రెండు. పూలతోటా, తోటమాలీ. యెవరికీ వెరపులేదు.

తొందరపడకుండా భర్త జగ్గరాజుగారి మద్దతులో దుర్గమ్మ, దోబూచులాడుతూ ప్రయాణీకురాలి మనుషులెంతమంది తన కొడుకు పంచన

చేరిమేస్తున్నారో, కనిబెట్టటంలో నిపుణత చూపుతుండగా, భర్త జగ్గరాజుగారికి బి.పి. హెచ్చిపోయింది. నైజం బైటికొచ్చింది. బి.పి. సాయం పట్టింది. నోటి కొచ్చినట్టు గ్రామ్యభాషవాడుతూ చిందులు తొక్కాడు. ప్రయాణీకురాలికి ముందు యేడుతరాల వారిని కంఠవాణిలాగా ఆపకుండా దుమ్మెత్తి పోశాడు. ఒక్క క్షణం వుండనన్నాడు. వెళ్లిపోవాల్సిందే. కులం పోయింది. ఇంటికి పోయి ప్రాయశ్చిత్తం చేయించుకోవాలి.

నీళ్లు తోడి స్నానం చేసి సహస్ర గాయత్రి జపించాడు. జపం పూర్తిచేస్తూనే అరవసాగాడు.

"దీని తాతా, కులం మంట గలిపితే, హత్య చేస్తే, హత్యానేరంనించి కాపాడాను. తిమ్మిని బ్రహ్మిని చేసి కులం నిలబెట్టాను" అని గొంతు చించుకున్నాడు. యెవరూ కలగజేసుకోలేదు.

ఫైనల్ సొల్యూషన్ కింద, టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ప్రయాణీకురాల్ని, దేశబహిష్కారం గానీ, అది వీలుపడకపోతే సంఘ బహిస్కారంగానీ చేయాలని సూచించాడు. డిక్రీ యిచ్చాడు.

సంజూ నవ్వుతూ బెడ్‌రూమ్ తలుపుచాటు నుండి తొంగి చూశాడు. వంటింటిలోకిపోయి తలుపుచాటు నుండి కనబడుతూ దోబూచీ! అని నవ్వు మొహం చూపించాడు.

బ్రహ్మరథం లాంటి అంబాసిడర్‌కారు మిలమిల మెరుస్తూ వచ్చింది. బ్రహ్మర్షిలాంటి డ్రైవర్ వచ్చి జంధ్యం సరిజేసుకుని దణ్ణం బెట్టాడు. జగ్గరాజు గార్ని మరో యిద్దరు బ్రహ్మర్షుల సాయంతో బ్రహ్మరథంలో దూర్చాడు. దుర్గమ్మకి సెల్యూట్ కొట్టి, "తమరుగూడానూ అందులో దూరాలి మేడమ్. ఋషిపత్నులు లేరు సమయానికి" అన్నాడు. ఆవిడా దూరింది విధిలేనట్టు.

''శాంతించాలి కౌశిగసగోత్రీకుడా! డిక్రీ యిచ్చారుగా జగ్గరాజుగారూ. అమలు జరుగును. మనం వెళ్లిపోతున్నాం. ఇక్కడే వుంటే మీరు హాస్పటల్లో చేరాల్సి రావచ్చు. ఇంకా రక్తపోటువల్ల పక్షవాతం రావచ్చు. పోదాం. మీ సరంజా మా డిక్కీలో కూరేశాము. రుద్రయాగం కంటె యీ యాగం యెక్కువ పుణ్యమిస్తుంది'' అని చక్రం ముందు కూచుని చెయ్యివూపాడు.

సంజా వీధితలుపుచాటునించి దోబూచులాడుతూ నవ్వుతూ చెయ్యివూపాడు.